ఈ-పంటలో పేర్లు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - నరసన్నపేట: మండలంలోని రైతులు ఈ-పంటలో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.సునీత అన్నారు. మంగళవారం మండలంలో రావులవలస, మడపాం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె వ్యవసాయదారులు పండించే వరి పొలాన్ని సందర్శించి, సూచనలు చేశారు. అనంతరం రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట వివరాలు, సామాజిక తనిఖీ జాబితాలను ఏర్పాటు చేశారు. అనంతరం సునీత మాట్లాడుతూ ఈ-పంటలో నమోదు చేసుకొని రైతులు ఈ నెలాఖరులోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, జాయి శేషు, రువ్వ వాసుదేవరావు, మద్దు క్రృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి: కలెక్టర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: 15 సంవత్సరాలు నిండిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. వయోజన విద్యపై కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం ఆయన సమీక్షించారు. ఉల్లాస్ అనే కార్యక్రమం ద్వారా ప్రధానంగా స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులు, ఆయాలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే నైట్ వాచ్‌మన్‌లు, తదితరులు దృష్టి సారించాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా నిరక్షరాస్యులను అక్షరా స్యులుగా తీర్చి దిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. సాయంత్రం అంగన్వాడీ భవనాల్లో తరగతులు నిర్వహించాలని చెప్పారు. ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సెక్రటరీ నోడల్ అధికారులుగా ఉండాలన్నారు. మండలాల వారీగా అక్షరాస్యత లక్ష్యాలను నిర్దేశిం చాలని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో అంగన్వాడీ, సామాజిక భవనాలను సాయంత్రం అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లా మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. విఓఎలు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ ద్వారా వాలంటీర్ టీచర్లను నేర్చుకునే వారిని గుర్తించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను సాయంత్రం రెండు గంటలపాటు అక్షరాస్యత తరగతులకు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ సమావేశంలో వయోజన విద్య ఉప సంచాలకులు ముద్దాడ వెంకటరమణ, సభ్యులు డీపీఓ కె.భారతి సౌజన్య, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి బి.శాంతి శ్రీ, డిఐపిఆర్ఓ కె.చెన్నకేశవరావు, ఎపిఓ బాలచందర్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పాలసీలో పారదర్శకతకు పాతర

- ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మద్యం దుకాణాలను మూసి వేయటం దారుణం
- విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై నోరెత్తని కూటమి
- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర - ఆమదాలవలస: ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మద్యం దుకాణాలను పక్కన పెట్టి టెండర్ల విధానంలో మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం కూటమి ప్రభుత్వం దగాకోరు విధానాలకు నిదర్శనమని మాజీ స్పీకర్, వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు తమ్మినేని సీతారాం అన్నారు. మద్యం దుకాణాలను ఖరారు చేసేందుకు పది రోజుల స్వల్ప విరామంలోని లైసెన్స్ కోసం దరఖాస్తులను ఆహ్వానించడం, వెను వెంటనే ఖరారు చేయడం వెనక భారీ అవినీతి చోటుచేసుకుందని ఆరోపించారు. ప్రభుత్వ నీతిమాలిన చర్య వలన 15,000 మంది ఉద్యోగులు వీధిన పడనున్నారన్నారు. ఏక పక్షంగా 80శాతం దుకాణాల లైసెన్సులు కూటమి సర్కారుకు చెందిన వ్యక్తులే దక్కించుకున్నా రన్నారు. 20శాతం లైసెన్సులు దక్కించుకునేందుకు గాను ఇతరులను బెదిరించడం తగదన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 45000 బెల్ట్ షాపులను రద్దు చేయడం జరిగిందన్నారు. తిరిగి వీటి పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్న విషయం నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇదే జరిగితే గ్రామాల్లో మద్యం ఏరులై పారటం ఖాయమన్నారు. ఉచిత ఇసుక అంటూ ఎన్నికల ముందు ప్రచారం చేసి, ఇప్పుడు రెండు రోజుల స్వల్ప విరామంలోనే 108 ఇసుక రీచ్‌లకు టెండర్లు ఖరారు చేశారన్నారు. రహస్యంగా ప్రభుత్వ పెద్దలకు వారికి కావల సిన వారితో టెండర్లు దాఖలు చేయించి బహిరంగ ఇసుక దోపిడీకి పాల్పడటం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్ అంటూ ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేక పోయారన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నోరు ఎత్తక పోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి ప్రజలకు చక్కని సేవలు అందించాలని తమ్మినేని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు బద్రి రామారావు, బొడ్డేపల్లి మన్మధరావు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

విశాలాంధ్ర - పలాస: పలాస మండలం బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతరిక్ష శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి భారతరత్న ఏ.పి.జె.అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వక్తలు ప్రసంగిస్తూ భారత రాష్ట్రపతి పదవికి ముందు, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ) ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)తో ఒక ఏరోస్పేస్ ఇంజనీర్‌గా కలాం పని చేశారని అన్నారు. తన విజ్ఞానాన్ని దేశాభివృద్ధికి ఉపయోగించి పాటుపడిన గొప్ప దేశభక్తుడని పేర్కొన్నారు. తన ఆలోచనలు ప్రసంగాలు ద్వారా విద్యార్థులను ఉత్తేజ పరిచేవారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్వి.రమణారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడ ఆదిత్యలో డిగ్రీ కళాశాలలో

శ్రీకాకుళం టౌన్: నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా అబ్దుల కలాం జయంతిని నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలాం ప్రపంచ దేశాలు మెచ్చిన గొప్ప శాస్త్రవేత్త అని, మన దేశ శాస్త్ర సాంకేతిక రంగంలో విశేష కృషి చేసి అనేక పురస్కారాలు, గౌరవాలు పొందారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, లైబ్రేరియన్ కమల్ కుమార్, విద్యార్థినీలు పాల్గొన్నారు.

న్యూ బ్రిలియంట్ పాఠశాలలో

టెక్కలి: స్థానిక న్యూ బ్రిలియంట్ పాఠశాలలో మంగళవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి బ్రిలియంట్ ప్రిన్సిపాల్ శోభారాణి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కలాం పేపర్ బాయ్‌గా కొనసాగి, క్షిపణుల తయారీలో సొంత టెక్నాలజీని వినియోగించి తద్వారా వాటి అభివృద్ధి చేసే మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచారని కొనియాడారు. ఎప్పటికీ ఆయన సేవలు మరవలేమని, ప్రతి ఒక్కరూ ఆయనని ఆదర్శంగా తీసుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పల్లె పండుగ'తో అభివృద్ధి పనులకు శ్రీకారం

విశాలాంధ్ర - కొత్తూరు: ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తోందని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు అన్నారు. కొత్తూరు మండలంలోని ఎన్ఎన్ కాలనీ, కర్లమ్మ, ఆర్ అండ్ ఆర్ గ్రామలలో పల్లె పండుగ కార్యక్రమాల్లో భాగంగా బీటీ రోడ్డు నిర్మాణానికి వైస్ ఎంపీపీ శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా లోతుగెడ్డ మాట్లాడుతూ నియోజక వర్గంలో సిసిరోడ్లు, బిటి రోడ్లు, నీటి సంరక్షణ ట్రెంచులు, గోకులాలను పెద్దఎత్తున అన్ని గ్రామాల్లో నిర్మించడం జరుగుతుందన్నారు. ఎంజిఎన్ ఆర్ఈజిఎస్ నిధులతో నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. "పల్లెపండుగ " ద్వారా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు, సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్ దాస్ నాయుడు, మాజీ సర్పంచ్‌లు లోతుగెడ్డ తాతబాబు, పడాల వెంకట కృష్ణ పాల్గొన్నారు.

పలాస: పలాస మండలం టెక్కలి పట్నం, బంటు కొత్తూరు గ్రామాల్లో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం టెక్కలి పట్నంలో రూ.9 లక్షలు, పెద నారాయణపురంలో రూ. 4.76 లక్షలు, కేశుపురం రూ.1.50 లక్షలు వ్యయంతో సిసి రోడ్డుకు పలాస ఎంపీపీ ఉంగ ప్రవీణ, ఎంపీడీవో వసంతరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పంచాయితీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠ రావు, పంచాయితీ రాజ్ ఏఈ గోపయ్య, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె పండగలో భాగంగా పెద్దసాన పంచాయతీలో సుమారు మూడు నుండి నాలుగు లక్షల రూపాయలతో సీసీ రహదారి నిర్మాణానికి మంగళవారం మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వమని, పల్లె పండగలో గ్రామాలలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా చేయడమే ఈ పల్లె పండగ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కూటమి ప్రభుత్వంలో పంచాయతీలలో ఉన్న గ్రామాల సమస్యలను ఒక్కొక్కటిగా త్వరలోనే పూర్తి అవుతాయని, ప్రతి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ శంకుస్థాపనలో ఎంపీడీవో లక్ష్మీబాయి, ఈఓపీఆర్డీ, ఏపీవో, మాజీ సర్పంచ్ కోట శివరామరాజు, అల్లు తులసి, చమళ్ళ వినోద్ కుమార్, ఎండ భీమారావు పాల్గొన్నారు.

జలుమూరు: పల్లె పండుగ కార్యక్రమం ద్వారా మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పల్లెలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందినట్లు అవుతుందని నరసన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జలుమూరు మండలం లింగాలవలస పంచాయతీ 326 ఎన్‌హెచ్ రోడ్ నుండి ఉసిరిక జోల వరకు 98 లక్షల రూపాయలతో నిర్మించనున్న తారు రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 1.9 కిలోమీటర్ల పొడవు గల ఈ రోడ్డును శరవేగంగా నిర్మించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దుంగ స్వామి బాబు, మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, జిల్లా మహిళా కార్యదర్శి గురిబిల్లి ఝాన్సీ, తహశీల్దార్ జి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించడం కోసమే పల్లె పండుగ నిర్వహించడం జరుగుతోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలంలో తండ్యంవలస, సిలగాం సింగువలస, అలికాం, బైరివానిపేట తదితర ప్రాంతాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ గ్రామాల్లో నివాసం ఉంటున్న కుంటుంబాలకు ఏడాదిలో కనీసం 100 రోజులు వేతన ఉపాధి, మెరుగైన జీవనోపాధి కల్పన చేశామని వివరించారు. గత వైసిపి పాలనలో ఐదేళ్లపాటు గ్రామీణ ప్రాంతాలు కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోక అధ్వాన్న పరిస్థితికి చేరుకుందన్నారు.

శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించి 32 కోట్ల రూపాయలతో రోడ్లు, కాలువలు ఇతర పనులు చేపట్టనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలంలోని మరువాడ పంచాయతీ యం.మరువాడ, డి.మరువాడ, సి. మరువాడ, ఆర్.మరువాడ గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సిమెంటు రోడ్లుకు మరువాడ పంచాయతీ సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి దాసురాజు, ఎంపీటీసీ సూరాడ రాజారావు భూమి పూజ చేసి శంకుస్థాపలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ వైస్ ఎంపీపీ సూరాడ భీమరావు, మాజీ సర్పంచులు నూకయ్య, కొర్లయ్య, నీలవేణి, రామిరెడ్డి, వార్డ్ మెంబర్లు, సెక్రటరీ డిక్కల వాసు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాకేష్ వర్మ, వెల్ఫర్ అసిస్టెంట్ మదు, ఫీల్డ్ అసిస్టెంట్లు ధనుంజయ, సీతయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు రాజారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట/కంచిలి: కంచిలి మండలం కత్తివరం, శ్రీరాంపురం, కొన్నాయిపుట్టుగ, తలతంపర గ్రామాల్లో మంగళవారం టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు అధికారులు కలిసి పల్లెపండగ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. జెడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి, మాజీ జెడ్పీటీసీ ఇప్పిలి కృష్ణారావు, టీడీపీ సీనియర్ నేత మాదిన రామారావు, పలువురు అధికారులు ఈ కార్యక్రమాల్లో భాగంగా సిమెంట్ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు.

డిస్లెక్సియాపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-రణస్థలం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భవిత ఉపాధ్యాయులు ఎం.బాలరాజు, ఎం.రూపదేవి, స్పెషల్ ఎడ్యుకేటర్ ఎం.డి.జె.బేగం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులతో డిస్లెక్సియాపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిస్లెక్సియా అనేది ఒక వయసులో వారు సాధారణంగా చదవగలిగిన దానికన్నా తక్కువగా చదివేలా చేసే ఒక వ్యాధని 1960వ దశకం వరకు దీనిని వర్డ్ బ్లైండ్‌నెస్ అంటారని అన్నారు. ఇది వేర్వేరు వ్యక్తులలో వేర్వేరు స్థాయిలలో ఉంటుందని, పదాలను సరిగా పలకకపోవడం, రాయకపోవడం, తొందరగా చదవలేక పోవడం, మనస్సులో చదవలేకపోవడం, వేరే వాళ్ళు చదువుతుంటే అర్థం చేసుకోలేక పోవడం మొదలైనవి దీని లక్షణాలని పేర్కొన్నారు. ఇటువంటి సమస్యలు ఉంటే విద్యార్థులు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో గ్యాస్ బర్నింగ్ మిషన్ ఏర్పాటు

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట రోటరీ సహాయంతో గ్రామపంచాయతీ సహకారంతో ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్మశానవాటికలో త్వరలో గ్యాస్ బర్నింగ్ మిషన్ ఏర్పాటు చేయనున్నట్లు రోటరీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ దుద్ది శ్రీనివాసరావు తెలిపారు. సోంపేటలో ఇప్పటి వరకు ఇటువంటి సదుపాయం లేక వ్యక్తులు చనిపోయిన సందర్భాల్లో కట్టెలతో చితిని పేర్చి దహన సంస్కారాలు నిర్వహించడం పెట్టుబడితో కూడిన పనిగా మారింది. పేదవర్గాలకు ఇవి భారంగా అవ్వడంతో రోటరీక్లబ్ ఇటువంటి తక్కువ ఖర్చుతో అంత్యక్రియలు నిర్వహించేందుకు సిద్ధమైంది.

చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర - పోలాకి: మనిషి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చేతులు పరిశుభ్రత ఎంతో అవసరమని పోలాకి వెలుగు అధికారి రాజారావు గుర్తు చేశారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం తినే ముందు ప్రతీ ఒక్కరూ సబ్బుతో చేతులు కడుక్కోవాలని సూచించారు. మండలంలో 45 గ్రామ సంఘాలలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే కార్యక్రమం జరుపుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సిసి ధనలక్ష్మి, ఆపరేటర్ నీరజ, అసిస్టెంట్ సత్యవతి, కుసుమ, దుర్గ భవాని, రమ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ సభ్యుల ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని గొర్లెపాడు గ్రామానికి చెందిన తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న బూర్లి శ్రీకాంత్ (24) ఎస్‌జీఎఫ్ సభ్యులు అండగా నిలిచారు. తన వైద్య చికిత్స కోసం ఆరు లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో దాతల సాయం కోసం ఎదురుచూశారు. విషయం తెలుసుకున్న గొర్లెపాడు ఎస్‌జీఎఫ్ సభ్యులు తక్షణ సహాయంగా రూ.20 వేలు శ్రీకాంత్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ మహిళ విభాగం సభ్యులు, గ్రామ యువత, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పిఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-సోంపేట: ప్రతి ఇంటిలో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ సదుపాయం పొందుతూ విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవాలని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోంపేటలో గల ఒక ప్రైవేటు ఫంక్షన్‌హాలులో ఈ కార్యక్రమంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని అన్నారు. గ్రామాల్లో ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సిబ్బందిని కోరారు.

త్వరలోనే పట్టాదారులకు రిజిస్ట్రేషన్లు

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలో మేఘవరం పంచాయతీలో రాయపాడు, వంగర, జక్కరావుపేట గ్రామ సమీపంలో గత ప్రభుత్వం 20-22 సంవత్సరంలో ఇల్లు లేని వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందని, కానీ పట్టాలపై రిజిస్ట్రేషన్ చేయలేదని బిజెపి మోర్చా జిల్లా అధ్యక్షులు జాన్ని పరమేశ్వరరావు కొద్ది రోజుల క్రితం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే దానికి రెవెన్యూ అధికారులు మంగళవారం స్పందించి కొత్తగా ఏర్పడిన ఎన్డీఏ కుటమి ప్రభుత్వం కొత్త ఉత్తర్వులు జారీ చేసిన వెంటనే అర్హులైన ప్రతి పట్టాదారుడుకి రిజిస్ట్రేషన్ చేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. వారికి కేటాయించిన ఇళ్ల స్థలాలకు ఎటువంటి ఆటంకం లేకుండా బిల్లులు పడే విధంగా చూస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ చిట్టిబారికి లింగరాజు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బసవ కోత్తూరు గ్రామంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో ఏపీ శాక్స్ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సలహా మేరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి సుమారుగా 162 మందికి వైద్యులు అజయ్, ఎస్కే ఆఫ్రిద్ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అందులో 32 మందికి ఈసీజీ చేశారు. అలాగే 88 మందికి హెచ్ఐవి టెస్టులు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రిసోర్స్ పర్సన్ హనుమంతు నాగభూషణరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్ఐవి స్థితిని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రతినిధి ఎం.ఈశ్వరరావు, రాముడు, ఏఎన్ఎం డిల్లమ్మ, ఫామ్ సిస్ట్ నీలవేణి, జోనల్ సూపర్వైజర్ పి.సుధాకర్, క్లస్టర్ లింక్ వర్కర్ గున్న రవి, ఆశా వర్కర్, అంగన్వాడి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలి

విశాలాంధ్ర-నరసన్నపేట: ఎల్.ఐ.సి పాలసీలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రద్దు చేయాలని ఎల్.ఐ.సి ఏజెంట్లు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎల్.ఐ.సి కార్యాలయం ఆవరణలో ఏజెంట్లు తమ డిమాండ్లు అమలు చేయాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలసీలను పాత పద్ధతుల్లో కొనసాగించాలని, పాలసీలపై బోనస్, కమీషన్ పెంచాలని అన్నారు. లియాఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నా కార్యక్రమంలో ఏజెంట్లు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నిర్థిష్ట అభ్యాస వైకల్యం పెద్ద సమస్య కాదు

- గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తే అద్భుత ఫలితాలు
- జిల్లా సహిత విద్య సమన్వయకర్త బుడుమూరు గోవిందరావు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: నిర్థిష్ట అభ్యసన వైకల్యం (డిస్లెక్సియా) అనేది పెద్ద సమస్య కాదని అలాంటి పిల్లలను గుర్తించి సకాలంలో ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ ఇస్తే సామాన్య విద్యార్థుల మాదిరి చదువులో రాణిస్తారని జిల్లా సహిత విద్య సమన్వయకర్త బుడుమూరు గోవిందరావు అన్నారు. నిర్థిష్ట అభ్యసన వైకల్యం మీద ఈ నెల 14 నుంచి 19 వరకు నిర్వహిస్తున్న అవగాహన వారోత్సవాలలో భాగంగా మంగళవారం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా బుడుమూరు గోవిందరావు మాట్లాడుతూ చదువులో వెనక బడిన విద్యార్థులు ఎవరైతే ఉన్నారో వారిలో అభ్యసనలో ఐదు రకాలకు సంబంధించి లోపాలు ఉంటాయని, ఆ వైఫల్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చునన్నారు. డిస్లెక్సియాతో ఉన్న అనేక మంది వ్యక్తులు సగటుకు మించిన మేధస్సును కలిగి ఉండి, సృజనాత్మకతతో సమస్యలను పరిష్కరించి, ఆయా పనుల్లో ప్రతిభను కనబరుస్తార న్నారు. ధ్వనులు, అక్షరాలు, పదాలను గుర్తించడం, రాయడం కష్టంగా మారుతుందని, ఈ విద్యార్థులు ముద్రించబడిన పుస్తకాలను చదవడం, చేతితో రాయడం వంటి పనుల్లో సమస్యలను ఎదుర్కొం టారన్నారు. కంప్యూటర్ లేదా ట్యాబ్‌లు వంటి డిజిటల్ పరికరాలను ఉపయోగించి వాటిలోని అప్లికేషన్ల సాయంతో ఈ అడ్డంకులను అధిగమించవచ్చునన్నారు. ఇలా డిజిటల్‌లో నేర్చుకోవడం ద్వారా డిస్లెక్సియా ఉన్న వాళ్ళు చదవడాన్ని ట్రాక్ చేయడంలో సహాయ పడటమే కాకుండా కొన్నిసార్లు వాయిస్ ద్వారా వారికి చదివి వినిపిస్తుందన్నారు. కంప్యూటర్ లేదా ట్యాబ్‌లు ఉపయోగించి ఆటో-కరెక్షన్ ఉన్న ఫీచర్ల ద్వారా రాయడం కూడా సులభంగా ఉంటుం దన్నారు. కొంతమంది ధ్వనులు అక్షరాలకు ఎలా అనుసంధాన మవుతాయో అర్థం చేసుకోవడంలో ఇబ్బంది పడతరాని, మరి కొంతమంది పాఠాన్ని సులభంగా చదవడం లేదా రాయడాన్ని అర్థం చేసుకోవడంలో కష్టపడవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఓ పెదాడ ప్రభాకర్, స్పెషల్ ఎడ్యుకేటర్ జి.గోవిందరావు, భవిత సెంటర్ ఉపాధ్యాయులు కుసుమ, చెల్లెమ్మ, భవిత సెంటర్ విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు: ఎస్పీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: బహిరంగంగా మద్యం సేవించి న్యూసెన్స్ సృష్టించిన ఓ వ్యక్తికి శ్రీకాకుళం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి వారు 14 రోజులు జైలు శిక్ష విధించారు. సోమవారం రాత్రి శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో బలగ మురళీ కృష్ణ (రౌడి షీటర్) బహిరంగంగా మద్యం సేవించడంతోపాటు, ప్రజలతో ఇబ్బందికరంగా ప్రవర్తించి న్యూసెన్స్ సృష్టించడంతో సదరు వ్యక్తిని గుర్తించి శ్రీకాకుళం వన్‌టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ కేసు నమోదు చేసి మంగళవారం ఉదయం కోర్టులో హాజరుపరిచారు. ఈ క్రమంలో శ్రీకాకుళం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు గౌరవ జడ్జి శివ రామకృష్ణ, బలగ మురళీ కృష్ణకు బహిరంగంగా మద్యం సేవించి న్యూసెన్స్ సృష్టించినందుకు 14 రోజులు జైలు శిక్ష విధించారు. బలగ మురళీకృష్ణపై శ్రీకాకుళం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గతంలో రౌడి షీట్ తెరిచి ఉంది. బహిరంగంగా మద్యం సేవించి న్యూసెన్స్ చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి హెచ్చరించారు.

విశాలాంధ్ర శ్రీకాకుళం
పేజి : 2
బుధవారం 16, అక్టోబరు 2024

గణ వ్యర్థ నిర్వహణా కేంద్రం పునఃప్రారంభం

మండల టిడిపి అధ్యక్షులు వెంకటరమణ

విశాలాంధ్ర-జలుమూరు : సారవకోట మండలం బైధిలాపురం గ్రామంలో మంగళవారం మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రమును పునః ప్రారంభించారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆయనతోపాటు సర్పంచ్ మత్రివలస గౌరమ్మ. ఎం సింహాచలం, మాజీ సర్పంచ్ ధర్మాన ఈశ్వరరావు, ఎండ రమణయ్య, చిన్నారావు, తంప సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి గోకలవలస మురళి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మద్ది శ్రీవాణి, మహిళా పోలీస్ బీరా యమున, డిటెల్ అసిస్టెంట్ కదుమ గోవి, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ శివ ఫీల్డ్ అసిస్టెంట్ జై నీలయ్య, పలువురు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కులకై పోరాడిన ఉద్యమకారుడు జిఎన్ సాయిబాబా

విశాలాంధ్ర-పలాస : ఆదివాసిల హక్కులకై పోరాడిన ఉద్యమకారుడు జి.ఎన్.సాయిబాబా అని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రొఫెసర్ జియన్ సాయిబాబా విద్యార్థి దశ నుండి శాస్త్రీయ విద్య కోసం విద్యార్థి ఉద్యమాలలో పాల్గొన్నారని, తర్వాత దేశంలో ఆదివాసీల కోసం శ్రామిక వర్గ ప్రజల కోసం వాళ్ళ హక్కుల కోసం గొంతు విప్పి మాట్లాడిన గొప్ప మేధావి సాయిబాబా అని అన్నారు. హక్కుల ఉల్లంఘన పై అంతర్జాతీయ వేదిక ఏర్పాటుకు కృషి చేసిన మానవ హక్కులనేత సాయిబాబా రాజధాని కేంద్రంగా దేశంలో పౌర ప్రజాస్వామిక వాదులను బుద్ధి జీవులను మేధావులను అణగారిన ప్రజలను కలుపుకొని అఖిల భారత స్థాయిలో ప్రజా ఫ్రంట్ ఏర్పాటు కు ఆయన కృషి అద్భుతమైనదని కొనియాడారు. సాయిబాబా జీవితం దేశములో అనేక పోరాటాలతో మమేకమై ప్రయాణం చేసిన వ్యక్తి అని ముఖ్యంగా మధ్య భాగంలో ఆదివాసీలపై జరుగుతున్న మారణకాండకు,ఆపరేషన్ గ్రీన్ హంట్ కు వ్యతిరేకంగా ఆదివాసీల హక్కులకై మాట్లాడిన మానవ హక్కుల నేత అని అన్నారు. తన శరీరము పూర్తిగా సహకరించకపోయినప్పటికీ కూడా తన మేదస్సుతో నూతన మానవుడు ఆవిష్కరణ కోసం కృషి చేసిన ప్రొఫెసర్ సాయిబాబా దుర్భరమైన అండా సెల్ జైలు జీవితం అనుభవిస్తూ నన్ను చూసి మరణం భయపడుతుందని వ్యాఖ్యానిస్తూ నిలబడిన హక్కుల ఉద్యమ నేత తన తల్లి,చెల్లెలు అమరత్వం పొందిన కూడా దృఢ సంకల్పంతో మానవాళి స్వేచ్ఛకై అంకితమైనారన్నారు. తన మేధస్సును చూసి భయపడిన రాజ్యము ఆయనను జైల్లోనే చంపాలని చూశారని అయితే న్యాయస్థానాల ముందు సరైన సాక్ష్యాలు చూపించడంలో విఫలమైనందుకు న్యాయస్థానాలు సాయిబాబాను విడుదల చేశాయని అన్నారు. సుదీర్ఘంగా 10 ఏళ్ళ కాలం ఆయన విడుదల కోసం దేశ అంతర్జాతీయంగా మానవతావాదులు ఆయన పక్షాన నిలబడి గొంతు విప్పారని, చివరకు ఐక్యరాజ్యసమితి కూడా ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేసిందని అయినా రాజ్యము కనికరించలేదన్నారు. రాజ్యం ఎన్ని కుట్రలు చేసినా తాను నమ్ముకున్న భావజాలంను ఏ క్షణం కూడా వదిలిపెట్టలేదని అలాంటి గొప్ప మేధావి సాయి బాబా అని కొనియాడారు. ఈ సమావేశానికి పౌర హక్కుల సంఘం అధ్యక్షులు పత్తిరి దానేష్ అధ్యక్షత వహించగా దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం రాష్ట్ర నాయకులు వీరాస్వామి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు బాలకృష్ణ పిఓడబ్ల్యు నాయకురాలు పోతనపల్లి కుసుమ పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు వినోద్ ఇఫ్టు నాయకులు వీరస్వామి సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మల్లేశ్వరరావు రామారావు సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు దున్న గోవిందు,డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర బాధ్యులు ధర్మారావు మాస్టారు కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా బాధ్యులు ప్రభాకర్ లు పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన గ్లోబల్ హ్యాండ్ వాష్ డే : ఏ.పి.ఎం. కూర్మారావు

విశాలాంధ్ర-హిరమండలం : ఐక్యరాజ్య సమితి వారి గ్లోబల్ హ్యాండ్ వాష్ డే అక్టోబర్ 15 సందర్భంగా అన్ని గ్రామ సంఘాల్లో మహిళలు వాష్ కార్యక్రమాలు మంగళవారం నిర్వహించినట్లు వెలుగు ఏ పి ఎం.పైడి కూర్మారావు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజలు ఎక్కువ అనారోగ్యానికి గురి కాకుండా ఉండడానికి మహిళలందరికీ శానిటేషన్ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ పరిశుభ్రమైన పరిసరాలతో పాటు వ్యక్తిగతశుభ్రత (హైజిన్) చాలా ముఖ్యమని వివరించారు. ప్రతి ఒక్కరు కూడా భోజనానికిముందు, వడ్డించే ముందు, పిల్లలు ఆటలాడుకొన్న తరువాత, మలమూత్ర విసర్జన తరువాత సబ్బుతో చేతులు కడుక్కుంటే చాలా రకాల అంటువ్యాధులకు దూరం కావచ్చని తెలిపారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమం సందర్భంగా ఈ కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్లు సుజాత, జయంతి, శ్రీదేవి మరియు సంఘాల ప్రతినిధులు వివోఏలు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం

పల్లె పండుగతో ప్రగతి పరుగులు : ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర-జలుమూరు: పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా జలుమూరు మండలం జలుమూరు నుండి బుడితి వయా వెంకటాపురం, రామచంద్రపురం, సుబ్రహ్మణ్యంపురం వరకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద 2.00 కోట్ల రూపాయల నిధులతో తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, పల్లె పండగ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రగతి పరుగులు తీస్తుందని, గ్రామాల్లో ప్రజల మౌలిక వసతుల కోసం ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారానికి కృషి చేయడమే జరుగుతుందని అన్నారు.గ్రామాల అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలకే 4500 కోట్ల రూపాయల నిధులతో 30 వేల పనులకు శ్రీకారం చుట్టిందని, ఎన్నికల ఇచ్చిన హామీలన్నీ దశలవారిగా నెరవేరుస్తామని మహిళలకు దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్, ఎంపీడీవో, కూటమి నాయకులు, కార్యకర్తలు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కలాం జయంతి వేడుకలు

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణంలో మాజీ భారత రాష్ట్రపతి మిస్సైల్ మెన్ అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి ప్రిన్సిపల్ బిందు మాధవి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అబ్దుల్ కలాం విశిష్ట సేవలు,సైంటిస్టా ఉన్నప్పుడు భారతదేశానికి చేసిన సేవలు గూర్చి ఉపాధ్యాయులు సంతోష్ విద్యార్థులకు తెలియజేశారు. అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా జీవితం గూర్చి సోషల్ టీచర్ రాజశేఖర్ విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు. మండల కేంద్రం కవిటి లో గల ఎస్ వి జె డిగ్రీ, జూనియర్ కాలేజీ విద్యార్థులు అబ్దుల్ కలాం జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రిన్సిపల్ ఎం భాస్కర్ రావు పూలమాలనేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ నేటి యువతికి అబ్దుల్ కలాం జీవితం ఆదర్శమని కలాం పేపర్ బాయ్ నుండి ప్రెసిడెంట్ వరకు దేశంలో ఉన్నత శిఖరాలు అందుకున్నారని శాస్త్రవేత్తగా దేశ సాంకేతిక రంగంలో ప్రపంచ దేశాలకు పోటీగా భారతదేశం ముందుకు నడిపించిన గొప్ప వ్యక్తి అని కలలు కనండి వాటిని సాకరం చేసుకోండి అని సందేశం తో యువతకు ప్రేరణ కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ,జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్స్ పీ సత్యం, కే. శంకర్, జే భీమారావు, ఎన్ ఎస్ ఎస్ పి ఓ లు మహేష్, వాలంటీర్స్ పాల్గొన్నారు. మండలంలోని పి వై జి పుట్టుగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దేవదాస్ ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్ కలాం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు దేవదాస్ చేతుల మీదుగా పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కవిటి: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా అబ్దుల్ కలాం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మంగళవారం సంత దరిలో ఉద్దానం బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్యాంపులో సుమారుగా 20 మంది పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు ఉద్దానం బ్లడ్ బ్యాంక్ వారు సర్టిఫికెట్స్ అందజేశారు. రక్తదానం చేసిన సభ్యులను అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.

టెక్కలి: మండల కేంద్రంలో ఉన్న స్థానిక శాఖా గ్రంథాలయంలో

భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 93వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారిని బి రూపవతి చేతుల మీదుగా పూలమాలను వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశ రక్షణ వ్యవస్థకు అను శక్తిని జోడించిన మిస్సైల్ మన్ ఏపీజే అబ్దుల్ కలాం అని అన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ఆయన జీవిత చరిత్రను వివరించారు. పేపర్ బాయ్ గా పని చేసిన ఆయన ఏరో స్పేస్ ఇంజనీరింగ్ పూర్తి చేశారని, డిఆర్డిఓ, ఐఎస్ఆర్వో లో చేరి ఆ రంగంలో సేవలు అందించిన భారత రత్నాకు జోహార్లు అంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: కలాం దేశం కోసం చేసిన సేవలను ఎప్పటికీ మరువలేనివని అమ్మఒడి స్కూల్ డైరెక్టర్ బి శ్రీనివాసరావు అన్నారు. స్కూల్ ఆవరణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఏపీజే అబ్దుల్ కలాం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అబ్దుల్ కలాం గొప్పతనం, దేశం కోసం చేసిన సేవలు గురించి ఉపన్యసించారు. చివరగా పాఠశాల

ప్రధానోపాధ్యాయులు దామోదర మాట్లాడుతూ కలాం జీవితం నుండి మనం ఎంతో నేర్చుకోవాలని,ఉన్నత విద్యా సాధనకు పేదరికం ఆటంకం కాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పుష్పలత, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలో కురిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

భారతరత్న మాజీ రాష్ట్రపతి డాక్టర్ పి.జే.సర్ అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రధానోపాధ్యాయులు ఈశ్వరరావు అధ్యక్షతన, పాతపట్నంనకు చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం 93వ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. మొదటిగా పాఠశాల ఆవరణలో ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే.గురువులు, బి.శ్రీనివాసరావు, ఆర్.కాంతారావు, ఎస్.అరుణ కుమారి, పి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, జి.కృష్ణవేణి విద్యార్థులు పాల్గొన్నారు.

జలుమూరు : భారతదేశ 11వ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 93వ

జయంతి పురస్కరించుకొని జేబీటీ పాఠశాల విద్యార్థులు కలాం అనే అక్షరం ఆకృతిలో విద్యార్థులు కూర్చున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేస్తూ భారత రాష్ట్రపతికి ముందుగా ఆయన రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థలు లో ఇంజనీర్ గా పని చేశారని ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు మోహన్ గాంధీ విద్యార్థులకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దదూగాంలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర-జలుమూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమం లో మంగళవారం పెద్ద దూగం, టెక్కలిపాడు రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయ సంచాలకులు కె రవీంద్రభారతి రైతులతో మాట్లాడుతూ వరిని ఆశించే తెగుళ్ళ పురుగులు మరియు పోషక లోపాలు యొక్క లక్షణాలు తెలియజేస్తూ నివారణ చర్యలు గూర్చి వివరించారు. ఇందులో భాగంగా వరి పొలాలను పరిశీలించి చీడపీడలు నివారణ చర్యలకు తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి వివరించారు. అంతేకాకుండా పురుగు మందులు వాడకం లో జాగ్రత్తలు, ఎరువులు యాజమాన్యం గూర్చి తెలియజేశారు. ఇందులో భాగంగా సేంద్రియ మరియు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం కోసం రైతులకు అవగాహన కల్పించారు. సూక్ష్మ నీటిపారుదల పద్ధతుల ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడం కోసం తద్వారా సాగు ఉత్పాదకతను పెంచి మెట్ట ప్రాంతాల్లో నీటి ఎద్దడిని తట్టుకునే చర్యలు గూర్చి అవగాహన కల్పించారు. చీడపీడల అరికట్టడంలో డ్రోన్లు వాడకం గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ తత్ర మాధవి, ఎంపీటీసీ ప్రతినిధి జీవరత్నం, రైతులు పాల్గొన్నారు.

లక్కివలస పంచాయితీలో పొలంబడి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం లక్కివలస పంచాయితీలో మంగళవారం పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్కివలస పంచాయతి టీడీపీ సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు పిట్ట రాజులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు జాబితాను సరిచూసుకోవాలి

మండల వ్యవసాయ అధికారి దుర్గాప్రసాద్

విశాలాంధ్ర-కవిటి: ఈ పంట నమోదు చేసుకున్న జాబితాను రైతులు సరిచూచుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి దుర్గాప్రసాద్ రైతులకు సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం కవిటి రైతు సేవా కేంద్రం వద్ద పంట నమోదు చేసుకున్న రైతుల జాబితాను ప్రదర్శించారు. అనంతరం ఏవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రైతు సమీప రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ మరియు ఉద్యానవన శాఖ ద్వారా ఈ పంట నమోదు చేసుకున్న జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని తెలియజేశారు. కావున రైతులు యొక్క వివరాలు తప్పుగా నమోదైతే సంబంధిత రైతు సేవ కేంద్రాలలో ఉన్న ఇన్చార్జిలకు తెలియజేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఈ ఓ వీరభద్రస్వామి, వీఆర్వో నారాయణ,వ్యవసాయ సహాయకులు సమన్వయ, దేవాడ దుర్యోధన, మాజీ ఎంపీటీసీ పొందూరు బాలకృష్ణ,రైతులు హరిహర రావు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని రాజపురం, బైరిపురం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటలు ఉన్నటువంటి పురుగులు, తెగుళ్ళ గురించి రైతులతో చర్చించారు.వంట పరిశీలనలో భాగంగా పంటలో ఉన్నటువంటి కాండం తొలిచేలని పురుగు ను గుర్తించి పురుగు నివారణకు కార్ట్ ఆఫ్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు.అంతేకాకుండా వ్యవసాయ యాంత్రీకరణ,రబీ కాలంలో వేయవలసిన పెసర, మినుము, నువ్వులు విత్తనాలు కోసం రైతులకు వివరాలను తెలుసుకున్నారు. రైతులు వరి సాగుకు నీటి సమస్య ఉన్నందువలన రైతులకు వ్యవసాయ బోర్లు ఇప్పించే విధంగా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి ఏ ఏ గణపతి, బైరిపురం గ్రామ సర్పంచ్ పుల్లట ప్రభాకర్ రావు,గ్రామస్తులు సీపాన వెంకటరమణ, పుల్లట రాజు, పుల్లట జగదీశ్వర్ రావు, సనపల కామేశ్వరరావు, పుల్లట సంతోష్, బచ్చు ధనుంజయ రావు, మిత్తన నూకయ్య, బల్లెడ సృజన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఇసుక రవాణాతో తమ పంట పొలాలు తోటలు పాడవుతున్నాయని ఇటువైపుగా వాహనాలు తేవద్దని దూసి రైతులు గ్రామస్తులు ట్రాక్టర్లను అడ్డుకొని ఇసుక ర్యాంపు రోడ్డుపై అడ్డంగా గేటు వేసి ఆందోళన చేశారు. దూసి వద్ద తమ యొక్క స్థలాల పై నుండి ఇసు క డంప్ చేయవద్దంటూ ట్రాక్టర్ల ను దూసి గ్రామస్తులు అడ్డుకోవడంతో రైతులు ట్రాక్టర్ యజమానుల మధ్య వాగ్వివాదం జరిగింది. వందలాది వాహనాలు తిరగడంతో పంట పొలాలు తోటలు పాడవు తున్నాయని రైతు లు ఆందోళన చెందారు. ఎన్నిసార్లు చెప్పినా వాహన యజమానులు వినుకోక పోవడంతో మంగళవారం అడ్డుకోవలసి వస్తుందని స్థల యజమానులు వాపోయారు. రాత్రి సమయా ల్లో భారీ వాహనాలు పొలాల మధ్యలో దించుకున్నారని దీంతో పంట పాడవు తుంద న్నారు. వాహనాల రాకపోకలతో దూసి దరిలోని పొలాలు పాడైపోతున్న ప్రభుత్వం పట్టిం చుకోవడంలేదని వైసీపీ యువజన నాయకు లు తమ్మినేని వెంకట చిరంజీవి నాగు అక్క డకు చేరుకొని రైతులు పక్షాన నిలిచారు. ఇప్పటికే ర్యాంపు వరకు ట్రాక్టర్లు వాహనాలు పేరుకుపోయాయి. తరువాత వైసిపి నాయ కులు ట్రాక్టర్ యజమానులు రైతులు మధ్య సయోధ్య కుదిర్చి రేపటి నుంచి ఇటువైపు వాహనాలు రావద్దని అలా నిలువురించ కుంటే ఎక్కడి వాహనాలు అక్కడే నిలిపి వేస్తామని హెచ్చరించారు. దీంతో వాహనా లను గేటు తీసి బయటకు తెచ్చారు. ఇసుక రవాణా దారులు మాత్రం రైతుల వద్ద కుదు ర్చుకున్న ఒప్పందాన్ని ఎంతవరకు ఆచరిస్తారో చూడాలి.

డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-నందిగాం : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు డిస్లెక్సియాపై నందిగాం పురవీధుల్లో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు యార్లాగుల హరిబాబు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

బుడితి హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో చైతన్య

విశాలాంధ్ర-జలుమూరు: సారవకోట మండలం బుడితి జిల్లా పరిషత్ హై స్కూల్ ను జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య మంగళవారం సందర్శించారు. ఇక్కడ చదువుతున్న మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థి దశలో చదువుతోపాటు అనేక రంగాల్లో విద్యార్థులు అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఆయనతోపాటు మండల విద్యాశాఖ అధికారి మడ్డు వెంకటరమణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రకుల అహకారం నశించాలి

విశాలాంధ్ర-పలాస: పలాస నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి చెందిన కొంత మంది నాయకులు రజక కుల నాయకుల పైన జరుగుతున్న అణచివేతలకు నిరసనగా మంగళవారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద రజక కుల సంఘం నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు రజక కుల నాయకులపై రాజకీయ అణచివేత సరికాదని , అగ్రకుల అహంకారం నశించాలని, చేతివృత్తి కులాల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నిరసన తెలియజేసారు. రాష్ట్రంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యావంతులకు రాజకీయాల్లో ప్రాధాన్య తీస్తున్నారని, దీన్ని పలాస నియోజకవర్గంలో జీర్ణించుకోలేని అగ్రకులానికి చెందిన వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతూ ఉండడం అప్రజస్వామికమని అన్నారు. ప్రజాస్వామ్యకు వాదులు దీన్ని ఖండించాలని కోరారు.

ఘనంగా ఆలయాల ప్రతిష్ట మహోత్సవం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మండలం చినడోకులపాడులో నూతనంగా నిర్మించిన శ్రీపాతపట్నం అమ్మవారు, శ్రీ మరిడి అమ్మవారి, శ్రీ చండీ అమ్మవారి ఆలయ,విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ యజ్ఞ, హోమ,బజా భజంత్రిలతో కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల వద్దకు భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం భక్తులకు అన్నసంతార్పణ కార్యక్రమం చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ, ఆలయ అభివృద్ధి కమీటి సభ్యులు,గ్రామ పెద్దలు, మహిళలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

కవిటి అగ్రహారంలో రైతులకు అవగాహన

విశాలాంధ్ర-నందిగాం : వరిలో తగిన మోతాదులో పొటాషియం వేసి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి పేయ్యల శ్రీకాంత్ వర్మ అన్నారు. మండలం కవిటి అగ్రహారం పెద్ద బాణాపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ క్రాప్ పంట నమోదు వివరాలు మండలంలో ఉన్న 22 రైతు సేవా కేంద్రాల్లో జాబితాలను వెలవరించామని వాటిని రైతులు చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వజ్జ బాబూరావు

విశాలాంధ్ర-పలాస: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ను ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలాస నియోజకవర్గం సమస్యల పై కలెక్టర్ కు విన్నవించారు. ఆయనతో పాటు టీడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, టంకాల రవి శంకర్ గుప్తా, బి.నాగరాజు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, సాసుమాన చంద్రమౌళి, జోగ మల్లి, యవ్వరి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కలుపు మొక్కలు తొలగించరూ..

విశాలాంధ్ర-నందిగాం : మండలం పెంటూరు నుండి నరేంద్రపురం, కనితూరు వెళ్లే ప్రధాని రహదారికి ఇరువైపులా ఇలా కలుపు మొక్కలు తుప్పలు పెరిగిపోయి రహదారి కనిపించకుండా తప్పులు అల్లుకుపోడడంతో వాహనదారులకు, పాదచారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నట్లు వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ఈ రహదారిలో యాక్సిడెంట్లు జరుగుతున్నాయని అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కోరుతున్నారు.

రోడ్డు పైనే రోడ్డు..?

ఆక్రమణలు తొలగించి, రోడ్లు నిర్మించాలి

విశాలాంధ్ర-మందస: గ్రామాల అభివృద్ధికై రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టిన "పల్లె పండగ" కార్యక్రమంకు పండగ వాతావరణం నెలకొంది. దీనిలో భాగంగా మందస మండలంలో పలు చోట్ల పెద్ద ఎత్తున సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణానికి గాను శంకుస్థాపనలు జరుగుతున్నాయి. అయితే మందస పట్టణంలో కొన్నిచోట్ల రోడ్లు ఉన్నచోటే వాటి పైన రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరగనున్నడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గౌడ వీధి గాయత్రి దేవి ఆలయం నుండి ఐటీడీఏ ఎస్ టి హాస్టల్ వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం జరగనుంది. ఈ ప్రాంతంలో రహదారి నిర్మాణం గతంలో జరిగింది.కొత్తగా రహదారులు అభివృద్ధికి నోచుకోవడం సరైనదే అయినప్పటికీ, రహదారులు లేని ప్రాంతంలో మొదట ప్రాధాన్యతగా రోడ్లు నిర్మించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా గాయత్రీ నగర్ కు గత కొన్ని దశాబ్దాలుగా రహదారి సౌకర్యం లేదు. వాహనాల రాకపోకలు సంగతి పక్కన పెడితే వర్షాకాలంలో కాలి నడకన వెళ్లేందుకు కూడా అవస్థలు తప్పడం లేదు. అటువంటిది గాయత్రి నగర్ కు మొదటి దశలో రోడ్డు నిర్మాణానికి నోచుకోకపోవడం విచారకరం. మరోవైపు బస్టాండ్ నుండి కాపు వీధి జంక్షన్ వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం జరగనుంది. ఈ రహదారిలో ఆక్రమణలు తొలగించి రహదారి విస్తరణ జరిపి ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. ఆక్రమణలు తొలగించకుండా రోడ్డుపైనే మరల రోడ్డు నిర్మిస్తే ఉపయోగం లేదనేది పలువురు అభిప్రాయం. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష వీటిపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని,కూటమి ప్రభుత్వ హయాం లో అభివృద్ధి పనులు ప్రాధాన్యత క్రమంలో నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

విశాలాంధ్ర
శ్రీకాకుళం
పేజి: 3
బుధవారం 16, అక్టోబర్, 2024

మన ఆరోగ్యం...మన చేతుల్లో ఉండాలి

విశాలాంధ్ర-నరసన్నపేట: మన ఆరోగ్యం..మన చేతుల్లో ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, డా.పి.లత అన్నారు. మంగళవారం స్థానిక కళాశాలలో ప్రపంచ చేతులు పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. ఎన్.ఎస్.ఎస్ యూనిట్-1,2 ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్, డా.లత మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి తమ అరచేతులు తరుచూ శుభ్రం చేసుకుంటూ ఉండాలని, వంట చేసే ముందు, భోజనం చేసే ముందు, మల, మూత్ర విసర్జన అనంతరం సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవటం వలన అంటు వ్యాధులు నుండి దూరంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ పివోలు, పి.ఢిల్లేశ్వర రావు, నాగరాజు, కళాశాల అధ్యాపక బృందం, విధ్యార్థులు పాల్గొన్నారు.

పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు ధరఖాస్తు చేసుకోండి

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా మంజూరు చేయబడిన పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, డా.పి.లత అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కళాశాల యందు పి.జి, ఎం.ఎస్సీ(రసాయనిక శాస్త్రం), ఎం.ఎస్సీ-కంప్యూటర్ సైన్స్ నందు ఖాళీలు ఉన్నాయన్నారు. అడ్మిషన్స్ పొందగోరు విధ్యార్థులుకు ఈనెల 21వతేదీ అని, వివరాలకు సెల్ నెం-9502866736కు సంప్రదించాలని కోరారు.

నేటి యువతకు దిక్సూచి డా.అబ్దుల్ కలాం

విశాలాంధ్ర-నరసన్నపేట: కలలు కనండి..సాకారం చేసుకోండి అని చెప్పిన భారత రాష్ట్రపతి, శాస్త్రవేత్త, డా.అబ్దుల్ కలాం నేటి యువతకు దిక్సూచి అని పద్మావతి డిగ్రీ కళాశాల డైరక్టర్, సిహెచ్.దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం డా.అబ్దుల్ కలాం జయంతి సంధర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

అనంతరం దుర్గాప్రసాద్ విధ్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశం కోసం ఆయన చేసిన సేవలు ఎనలేనివని, ఆయన బోధనలు ఎప్పటికీ మనందరికీ స్పూర్తి కల్గిస్తూనే ఉంటాయని తెలిపారు. విధ్యార్థులను సమాజంలో విప్లవాత్మకంగా మార్చే భవిష్యత్తు నాయకులుగా మార్చే ప్రయత్నం చేశారని, లక్ష్యాలను నిర్ధేశించుకోవటానికి, వాటిని సాధించేలా విధ్యార్థులను ప్రేరేపించారని అన్నారు. దీని కారణంగా డా.అబ్దుల్ కలాం జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ రోజు ప్రపంచ విధ్యార్థి దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇంఛార్జ్, ముకల్ల శ్రీనివాసరావు, అధ్యాపకులు, గౌరీశంకర్, కె.రాము, విధ్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట జూనియర్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు, ఎజిఎంసి రజనీకుమారి మాట్లాడారు. భారతజాతి గర్వించదగ్గ వ్యక్తి అబ్దుల్‌కలాం స్ఫూర్తితో విద్యార్థులు చదువుల్లో ఉన్నతంగా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు ఎ.రామినాయుడు, ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు: సమగ్ర శిక్ష పథక సంచాలకులు ఆదేశాల మేరకు మంగళవారం వజ్రపుకొత్తూరులో డిస్లెక్సియా పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైకల్యం శాపం కాదని పట్టుదలతో సాధన చేస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని అనేక మంది నిరూపించి చూపారని ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర పండా అన్నారు. ఎవరూ అధైర్య పడవద్దని మంచి భవిష్యత్తు కోసం శ్రమించడని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీ పైల గజేంద్ర, తమ్మినాన భోజరాజు, వాసుదేవరావు, సాంబమూర్తి, భవిత సెంటర్ ఉపాధ్యాయులు బమ్మిడి అరుణ, హెచ్. రోజారమణి పాల్గొన్నారు.

అవినీతిలో సిద్ధహస్తుడు ఎమ్మెల్యే కూన

ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ

విశాలాంధ్ర - ఆమదాలవలస: అక్షరమాల ముందు ఉండవలసిన ఆమదాలవలస అవినీతిలో ముందుందని ఆమదాలవలస నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ తెలిపారు. మంగళవారం కార్యాలయంలో పత్రికా సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధిలో కాకుండా గడిచిన నాలుగు నెలలుగా కూన రవికుమార్ చేస్తున్న అక్రమాలకు హద్దు లేకుండా పోయిందన్నారు. నియోజవర్గం బూర్జ మండలం ఖాకాండ్యాంలో తప్ప అధికారికంగా ఎక్కడా ఇసుక రేణువులు లేవని, ఆమదాలవలస మండలం తోటవాడ, అక్కివరం, దూసి, దూసిపేట, తొగరాం, కొత్తవలస, నిమ్మ తోర్ల వాడ, కొరపాం, చేవ్వాకులపేట తదితర గ్రామాల్లో అనధికారికంగా ఇసుక రేవులో నడిపి లారీకి శాసనసభ్యులు వాటా పదివేలు, స్థానిక తెలుగుదేశం సభ్యులు వాట రెండువేలు వసూలు చేసి గడిచిన నాలుగు నెలల్లో సుమారు 40 కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించారని విమర్శించారు. ఉచితంగా ఇసుక ఇస్తామని ప్రభుత్వ పాలసీ అన్నారని ఎక్కడా కానరావడం లేదన్నారు. ట్రాన్స్పోర్ట్ చార్జీల పేరిట వారి సొంత వాహనాలతో వేల రూపాయలు గుంజుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో లారీ ఇసుక పదహారు వేల రూపాయలు ప్రస్తుత ప్రభుత్వంలో ముప్పైవేల రూపాయలు అని, ఈ సొమ్ము ఎవరి జేబులోకి వెళ్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వ రేటు ప్రకారం 6,800 డీడీ ఇసుక రావాలని, కానీ ముప్పై వేలరుపాయలు కలెక్షన్ చేస్తున్నారని, ఎవరి వాటా ఎంత అని ప్రశ్నించారు. అలాగే పొందూరు మండలం కృష్ణాపురం జంక్షన్ వద్ద లోలుగు, కృష్ణాపురం, వీఆర్ గూడెం గ్రామాల పరిధిలో శాసన సభ్యులు సొంత స్టోన్ క్రషర్‌కు ఎటువంటి అనుమతులు లేవని, ఎమ్మెల్యే అనుచరులు అడ్డగోలుగా గ్రావెల్ అక్రమాలతో ధనార్జనకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. నిబంధనలు పాటించకుండా తవ్వకాలు చేపట్టి మణికంఠ అనే మైనర్ బాలుడు మృతికి కారకులయ్యారని విమర్శించారు. వీరిపై మైన్స్ పోలీస్ ఏ ఒక్కరూ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం అన్నారు. ఆమదాలవలస మండలం కొరపాం పంచాయితీలో స్థానిక మండల రెవెన్యూ అధికారి ఇరవై ఇసుక లారీలు సీజ్ చేయడం జరిగిందని, కానీ కొరపాం వీఆర్వో వాటిని అక్రమంగా విక్రయించడంపై గ్రామస్తులు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ అధికారులు పనితీరుకు అద్దం పడుతుందన్నారు. అధికార పార్టీకి కొమ్ముకాస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారన్నారు. బూర్జ మండలం ఖండ్యంలో అధికారిక ఇసుకరేవులో ప్రభుత్వానికి ఒక లారీకి ఒకే పర్మిట్ ఉన్నప్పటికీ ఒక లారీ పర్మిట్‌తో ఐదు ఆరు లారీలు చూపించి నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఆమదాలవలస ఎమ్మెల్యే అవినీతిపై ప్రభుత్వానికి చేరేలా పోరాటం చేస్తామని గాంధీ స్పష్టం చేశారు. ఈయనతోపాటు పేడాడ వైకుంఠరావు, అన్నెపు సూరిబాబు, రాపాక మాజీ ఎంపీటీసీ పోతురాజు సూర్యారావు, బొడ్డేపల్లి గోవింద, పైడి విజయరమణ, బెండి రాజేష్, ఆది నారాయణ, ఎ.వాసుదేవరావు, బెండి పాపారావు, ఇల్లాకుల శ్రీను, వి అప్పలనాయుడు, సూర కిరణ్, గురుగుబెల్లి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన వన్‌టౌన్ పోలీసులు

- అభినందించిన జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ఒక వ్యక్తి ప్రాణాంతక నిర్ణయం తీసుకోవడానికి యత్నించిన సందర్భంలో అప్రమత్తతతో స్పందించి ఆయనను జిల్లా పోలీసులు రక్షించారు. వ్యక్తిగత కారణాల వలన మనస్థాపనంకు గురై ఆత్మహత్య చేసుకోబోతున్న ఓ వ్యక్తిని శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీసులు ప్రాణాలు కాపాడారు. వివరాలు... మంగళవారం అర్ధ రాత్రి సుమారు 1.30 గంటల సమయంలో శ్రీకాకుళం వన్ టౌన్ స్టేషన్ రాత్రి బీట్ తనిఖీ అధికారి హెడ్ కానిస్టేబుల్ తన విధి నిర్వహణలో భాగంగా తన సిబ్బందితో పొన్నాడ బ్రిడ్జి వైపు వెళుతుండగా అదే సమయంలో శ్రీకాకుళం పట్టణం మావూరి వీధికి చెందిన గుంటా ముక్కల శివప్రసాద్ అనే వ్యక్తి పొన్నాడ బ్రిడ్జి పైనుండి నాగావళి నదిలోకి దిగి ఆత్మహత్య ప్రయత్నం చేసుకొనుటకు ప్రయత్నించగా సదురు వ్యక్తిని గుర్తించిన నైట్ బీట్ తనిఖీ అధికారి తన సిబ్బందితో హుటాహుటిన పొన్నాడ వంతెన క్రిందకు దిగి నీటిలో మునిగిపోతున్న వ్యక్తి వద్దకు వెళ్లి, ఒడ్డుకు తీసుకువచ్చి ప్రాణాలు కాపాడారు. చనిపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. వంతెనపై తీసుకువచ్చిన శివ ప్రసాద్‌కు హెడ్ కానిస్టేబుల్ టి.అమ్మాజీ కౌన్సిలింగ్ ఇచ్చారు. సమస్యకి చావు ఒకటే పరిష్కారం కాదని, క్షణకావేశంతో తీసుకున్న నిర్ణయాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని మనపై ఆధారపడిన ఉన్న తల్లిదండ్రులు, పిల్లల గురించి ఆలోచించాలని, ఆత్మహత్య ఒక్కటే పరిష్కారం కాదని పోలీసులు సూచించారు. అనంతరం పోలీసు వాహనంపై అతనికి ఇంటికి తీసుకువెళ్లి తల్లిదండ్రులకు అప్పగించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి వ్యక్తి ప్రాణాలు కాపాడిన హెడ్ కానిస్టేబుల్ టి.అమ్మాజి, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్ చంద్ర శేఖర్, మహిళ హెూంగార్డు నారాయణమ్మ లను జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించి, నగదు పురస్కారాన్ని ప్రధానం చేసి, ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి శ్రీనివాసరావు, డిఎస్పీ వివేకానంద్, సిఐ పైడిపు నాయడు, ఎస్ఐ హరికృష్ణ ఉన్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర - పలాస: పలాస సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జూనియర్ సివిల్ జడ్జ్ బి ఎం ఆర్ ప్రసన్న లత అన్నారు ఈ మేరకు మంగళవారం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అదాలత్ లో అన్ని సివిల్ సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులు, రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తామన్నారు ఈ అవకాశాన్ని న్యాయవాదులు పోలీసులు కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పి జి రాజరత్నం నాయుడు, పి ఎల్ నారాయణ, బెండి కాళిదాస్, లక్కోజు చంద్రశేఖర్, పిండి వెంకట్రావు, బికె ఆర్ పట్నాయక్, తాండ్ర మురళి, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.